# 34. అనార్కలి

ఈమె అక్బర్ చక్రవర్తి జనానా యందలి ఒకానొక బానిసపడుచు. ఈమె అసలు నామధేయము నదిరా. ఒకనాడు అక్బరు ఆమె సౌందర్యమునకు ముగ్ధుడై "అనార్కలీ" అని పిలచెను. అనార్కలి అనగా దానిమ్మ మొగ్గని అర్థము. నాటినుండియు ఈమె పేరు అనార్కలిగా మారినది.

అనార్కలి బాల్యమందే రాణివాసము లందలి స్త్రీలకు ఆశ్చర్యము గల్గించుచుండెడిది. జనానా యందలి బీగమ్‌లు అనార్కలితో ఆడుకొను చుండెడివారు. ఈమె తల్లిదండ్రు లెవరో చరిత్రయందు కానరాదు. తల్లిదండ్రు లెవరైననూ ఈమె మాత్రము చరిత్ర ప్రసిద్ధమగుటకు కారణము – ఈమె సలీమ్‌చే ప్రేమింపబడుటయే!

అనార్కలి బాల్యమును వీడి యవ్వన దశను ప్రవేశించుచున్నది. మొగ్గ పువ్వు గాకుండునా? మొగ్గయే ముద్దులు మూటగట్టుచుండ – పుష్ప మెంత సౌందర్యముతో విరాజిల్లవలెను! అట్లే అనార్కలి యవ్వనదశను జొచ్చి చూపరకు తన సౌందర్యముచే ఆశ్చర్యము గల్గించుచుండెను. ఆమె బాల్య చేష్టలు పోయినవి. ఆమె కన్నులయందు నూతన కాంతి ప్రవేశమైనది. ఆమె పెదవులందు చిరునవ్వు తొణుకాడ ఆరంభించినది.

జనానాలోని ఇతర వనితలు అనార్కలికి తమ యవ్వనం గుఱించి చెప్పుదురు; వారు అనార్కలిని జూచి నవ్వుచు, "అదుగో! దానిమ్మ మొగ్గ వికసించినది", అందురు. అందులకు అనార్కలీ, "ఎందుకు వికసించదు?" అనును. వారందరునూ కలిసి నవ్వుదురు. ఇట్లు అనార్కలి విశ్రాంతి లేక తన సఖులతో కలసి ఆట పాటలందు మేటి అయినది.

❋ ❋ ❋

అనార్కలి యవ్వనము పురుషుల నందరనూ చలింపజేయు చుండెను. అనార్కలిని చూచుటయన్న – ఆమెను ప్రేమించుటయే! నాటి జనానాలో కూడ అంతటి సౌందర్యవతులు లేరట! ఆమె యవ్వనమున చలించిన వారిలో సలీమ్ ముఖ్యుడు. సలీమ్, అక్బర్ చక్రవర్తి ప్రథమపుత్రుడు ఈతడే చక్రవర్తయి తన నామమును జహంగీర్ అని మార్చుకొనెను.

సలీమ్ అనార్కలిని చూడనిదే నిముసమైన గడుపజాలడు. ఆమె ఎచ్చటికి పోయిననూ తాను కూడా ఆమెను వెంబడించ ప్రయత్నించును. సలీమ్‌కూడ క్రొత్తగా యవ్వనదశలో ప్రవేశించినవాడు. సలీమ్ ప్రేమ నానాటికి దృఢమైనది. అతడు తన ప్రేమను అనార్కలికి తెలియపరచవలెనని పట్టుదలతో సమయముకొరకు వేచియుండెను.

ఆ సాయంత్రము వాన కొద్దిగకురిసినది. రాజోద్యానమందలి ప్రతి పుష్పమును ఆ వాన నీటిచే శుభ్రపరుపబడి, తమ సుగంధమును నానా తావులకు విరజిమ్ముచుండెను. ఆకులపై నిలచిన నీరు ఒక్కొక్కచుక్కే భూమిని తాకి ఇంపగు శబ్దములు చేయుచుండెను. వర్షమును కురిపించుటకు వచ్చిన మేఘములు ఒక్కొక్కటే వీడి – తమ వెనుకనున్న నిర్మలాకాశమును ప్రదర్శించుచుండెను. సూర్యుడప్పుడే పశ్చిమాంబుధిన ...స్నానమాడబోయెను. శుక్ల పక్షదినము లగుటచే చంద్రుడు మబ్బుచాటులనుంచి దాగుడుమూత లాడుకొనుచుండెను. ఆ సమయమున అనార్కలి రాజోద్యానమున తన పెంపుడు లేడికై వెదకుచుండెను.

ఆరా......ఆరా....

మృదుకంఠధ్వనితో లేడిని పిలుచును, చిన్న ప్రతిధ్వని తప్ప ఆమె కింకేమియు వినరాదు. ఆమె కంఠధ్వని ప్రశాంతముగనున్న ఉద్యానవనమున గంధర్వగానమువలె నుండెను.

“ఆరా......ఆరా”....

మరల చిన్న ప్రతిధ్వని, తరువాత బంగారు గంటల చప్పుడు దూరముగా వినబడును. తిరిగి గంటలధ్వని. ధ్వనిహీనముగా దూరమునుండి వినబడుచున్నది. అనార్కలి ఇంకను ముందుకు నడచినది.

“ఆరా...........ఆరా!”...

ఈమారు గంటలచప్పుడు స్ఫుటముగనున్నది. ఆ గంటలు ఆమె పెంపుడులేడి మెడలోనివే! ఆమెకు సమీపముననే ఆ లేడి ఉండవలెను. ఆమె నలుదిక్కులా చూడదొడగెను. ఆమె ఇప్పుడున్న ప్రదేశము – ఉద్యానవనములో ఒక మూల ఆమె పిలుపులకు సమాధానముగ గంటలు లేడిచంగుచంగున ఎగురుచు ఆమె ఒడిలోనికి దూకెను. అనార్కలి లేడిని చేతితోతట్టుచు, ఇంతవరకూ ఎక్కడకు వెళ్లావు? నీ ఆలస్యమునకు కారణము...

"నేను"

అనార్కలి తన చుట్టుపట్లచూచెను. ఆమె మాటలకు సమాధానమిచ్చిన దెవరు? ఆమెకు వెనుక వైపున నిలబడిన యువరాజు సలీమ్. అనార్కలి భయపడెను.

సలీమ్, "నేనే నీ లేడిని పోనివ్వలేదు" అనుచు చిరునవ్వు నవ్వెను.

అనార్కలికి ఎక్కడలేని సిగ్గు ఒక్కసారి వచ్చెను. తన ముఖధారణమును సరిచేసుకొనెను. సలీమ్‌కు నమస్కరించి, "ప్రభువులు క్షమించాలి. నాకు తెలియక..."

ఆమె మాట పూర్తిగాక పూర్వమే సలీమ్ "నీవే నన్ను క్షమించాలి. నేను నీ లేడిని ఇంత వరకూ పోనివ్వలే"దని సలీమ్ అనెను.

సలీమ్ అట్లనుటలో అనార్కలికి అర్థము కాని సుఖముండెను.

"నేను నీ లేడిని ఎందుకు పోనివ్వలేదో తెలియునా?" సలీమ్ చిరునవ్వుతో ఆమె సమీపమునకు నడచి, "ఆ లేడికళ్ళకునూ నీ కళ్లకునూ భేదములేదు," అనెను.

అనార్కలి సలీమ్ మాటలను వినెను. ఇంతకు పూర్వమునుండియు సలీమ్ ప్రవర్తన ఆమెకు తెలియకపోలేదు. నేటివరకునూ పొందని ఒక విధమగు సంతోషము ఆమె ఆత్మయందుద్భవించెను.

సలీమ్ ఆమె ప్రక్కనే నిలబడియుండెను. ఆమె ముఖము పైకెత్తి సలీమ్‌ను చూచెను. వారి చూపులు కలసెను. సలీమ్ అనార్కలివైపు ఆశతో చూచుచు చిరునవ్వు నవ్వుచుండెను. సలీమ్‌ను చూచిన అనార్కలి - అప్రయత్నముగ చిరునవ్వు నవ్వెను. సలీమ్ తన హస్తములను ఆమె భుజములపై నుంచి - దగ్గరకు లాగుకొనెను.

"నువ్వే నా జీవితాధారము. నువ్వు నా దానివి" అని సలీమ్ మెల్లగా ననెను.

అనార్కలికి ఏమి చెప్పుటకును తోచలేదు. సలీమ్ తన పెదవులను ఆమె పెదవుల కానించెను. లేడి చిన్నగా అరచినది - దానికళ్లనుండి రెండు నీటి బిందువులు రాలినవి!

నాడు రాజోద్యానమున రెండు ప్రేమపక్షులు!

ఆ రాత్రి అనార్కలికి నిద్రపట్టలేదు. ఆమె మనస్సున నాటిసాయంత్రము జరిగిన సంగతులే తిరుగుచుండెను. తలవని తలంపుగా ఆమె ప్రేమ పాశములో బడినది. సలీమ్‌తో మాట్లాడినపుడు పొందిన సుఖమును తలచుకొనుచుండెను. ఆమె జీవితమునందానాటి సాయింత్ర ఘట్టమే మిక్కిలి సంతోషకరమైనది!

సలీమ్‌కుకూడా ఆ రాత్రి మెలకువలలోనే గడచినది. అనార్కలిని తలచుకొనుచు సలీమ్ ఒక విధమగు సంతోషముతో రాత్రంతయూ గడపెను.

ఇట్లు దినదినమును వారి ప్రేమ వృక్షము, చిలువలు పలవలతో వృద్ధిపొందసాగెను. వారి ప్రేమ విషయములు బహు రహస్యముగ సాగి పోవుచుండెను.

సలీమ్‌ను విడిచి అనార్కలి నిముస ముండలేదు – అనార్కలిని విడిచి సలీమ్ క్షణమైన గడుపలేదు!

❋ ❋ ❋

అనార్కలి అందగత్తెయే కాదు! ఆమె మంచి పాటకురాలు. గొప్ప నాట్యకత్తె. నాటి నాట్యకత్తెలలో అనార్కలిని మించినవారు లేరు.

అక్బర్ చక్రవర్తి విలాసముకొరకప్పుడప్పుడు నాట్యముల జూచువాడు. అతడు అనార్కలి నాట్యమునకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చెడివాడు. అక్బర్‌కు సంగీతమన్న ఎక్కువ మక్కువ. ఆ సంగీతమును అనార్కలి పాడిన వినుటయన్న అయనకు మిక్కిలి ఇష్టము.

ఒకనాడు, చక్రవర్తి సంగీత పరీక్షతోపాటు నాట్యపరీక్షనుగూడ చేయదలచెను. అనార్కలియే ఈ ద్వంద్వకళలలో ప్రావీణ్యురాలని అక్బర్‌కు తెలియకపోలేదు. ఈ 'ప్రావీణ్యత' యే అక్బర్‌కు అనార్కలియన్న ఒక విధమగు గౌరవమును కల్గించెను. ఆ పరీక్ష జనానా స్త్రీలకు మాత్రమే అవకాశమిచ్చినది.

అక్బర్ చక్రవర్తి జనానాలో ఒక భాగమును షీషమహల్ అందురు. ఆ గదియందు గోడలన్నియు అద్దములచే కప్పబడియుండటచే – ఆ భాగమునకు వేరేపేరు పెట్టబడెను. జనానాలో నాట్యప్రదర్శనములన్నియు ఆ హాల్ నందు జరుగుచుండెడివి. ఆ హాలు నేల పాలరాతితో కట్టబడిన దగుటచే క్రిందకూడ ప్రతిబింబము కన్పించుట కవకాశమున్నది. కాని నాట్యమప్పుడు కాలుజారకుండ, విలువగు తివాసులు నేలపై పరచియుండును. ఆ హాలు చూచుట కెంతయో ఇంపు గొల్పుచుండునట!

నాట్యము ప్రారంభమయ్యెను. చాలమంది తమ ప్రావీణ్యతలను ప్రదర్శించిరి. కొంతసేపైన పిదప అక్బర్ అనార్కలిని పిలచెను. అనార్కలి విలువగు దుస్తులు ధరించి హాలునందు ప్రవేశించి అక్బర్ చక్రవర్తికి నమస్కరించెను. ఆమెకు స్వభావసిద్ధముగనున్న అందమునకు – ఆమె ధరించిన దుస్తులు – విలువగు ఆభరణములు – ఆమె సౌందర్యమును ద్విగుణీకృతము జేసెను. అనార్కలి ఆనాటివరకునూ అంత విలువగు దుస్తులనుగాని, ఆభరణములనుగాని ధరించియుండలేదు.

చక్రవర్తి అనార్కలిని జూచి చిరునవ్వుతో, "పూర్ణచంద్రుడు, అలంకారములతో గూడ – ఈ మిణుకు మిణుకు మను నక్షత్రముల ఓడించవలెనా? నీకీ దుస్తు లెందుకు?" అనెను.

ఆమె హృదయములో నున్న సంగతి చక్రవర్తి కెట్లు చెప్పగలదు? ఆమె మంచి దుస్తులను ధరింపరాదా? తన ప్రియుడు సలీమ్ అచ్చటనే వున్నాడు. అతని ఆనందింపజేయుట కామె తన విలువగు దుస్తులను ధరించినది!

సంగీత వాయిద్యములు ఇంపుగ వాయింపబడుచుండెను. అనార్కలీ సలీమ్ వంక తిరిగి చిరునవ్వు నవ్వి నాట్యమును మొదలిడెను. ఆమె కాళ్లకు కట్టుకొన్న బంగారు మువ్వల చప్పుడు - నాటి లేడి మెడలోని బంగారు గంటల చప్పుడును జ్ఞాపక పరుచుచుండెను. నాట్యము చేయుచు - తన మృదువగు కంఠముతో పాడుచు చక్రవర్తిని, తన ప్రియుని సంతోష సముద్రములో ముంచి వేయుచుండెను.

ఆమెపాడిన పాటల కామెయే పరవశత్వ మొందెను. ఆమె కది యంతయు ఒక కలవలె దోచెను. ప్రేమ ఒక్కటే సత్యమని ఆమె నమ్మకము. ఆమె నాట్యము చేసిన కాలమంతయూ - ఆమె కళ్లు సలీమ్ మీదనే లగ్నమయ్యెను. సలీమ్ కూడ అనార్కలిని కన్నార్పక జూచుచుండెను. ఇద్దరి మధ్యనూ చిరునవ్వులు మొదలిడెను.

ఆ హాలు అద్దములచే అమర్పబడినది గావున ఎవరు ఏమి చేయుచున్ననూ - అద్దములందు ప్రతిబింబించును. చక్రవర్తి తన కుమారుని వికారములను జూచుచుండెను. చక్రవర్తి మొదట సలీమ్‌ను సంశయించలేదు గాని - తరువాత మన ప్రేమ పక్షుల చిరునవ్వులు గమనించి - విషయము అర్థముజేసికొన కలిగెను. చక్రవర్తికి ఒక్కసారిగ కోపము వచ్చెను. నాట్యము నాపమని ఆజ్ఞాపించెను. చక్రవర్తి స్వభావసిద్ధముగ శాంతమూర్తియే కాని, యువరాజగు సలీమ్ ఒక బానిస పడుచుచే చలింపబడుటను అక్బర్ సహింపలేకపోయెను. అక్బర్ సలీమ్ ప్రవర్తనను మార్చదలచెను - దానికి అనార్కలి యెడనే తగు చర్యదీసి కొనదలచెను. ఇట్లు అనార్కలి చక్రవర్తి కోపాగ్నికి గురియయ్యెను.

చక్రవర్తి తన వణుకుతూవున్న చూపుడు ప్రేలును అనార్కలి వైపుచూపుచు, "ఈ పిల్లను బంధించి జైలులో నుంచుడు. రేపుఉదయము ఈమెను ప్రాణములతోనే పాతిపెట్టుడు. తన వలపును భేదము లేకుండ ప్రదర్శింపదలచు ప్రతిహీనకుల కన్యకునూ ఇదియే గతి!" అని ఆజ్ఞాపించెను.

నిశ్శబ్దముగానున్న ఆ గదియందు చక్రవర్తి మాటలు సింహగర్జనలవలె నుండెను. ప్రతివారును శిలావిగ్రహములవలె నిలబడి పోయిరి. అనార్కలి చక్రవర్తిని జూచుచు ఆశ్చర్యమొందెను. చక్రవర్తి వేలు తన వైపే చూపబడుచున్నది - మొదట తనను కాదేమోననుకున్నది. ఇంకేమున్నది? ఆమె ప్రేమ సౌధ మొక్కసారిగ కూలినట్లాయెను. ఆమె ఒక శిలాప్రతిమవలె - నిర్జీవ రమణివలె - అట్లే నిలబడిపోయెను. గదియందు గుసగుసలు బయలుదేరెను. ఆమె తానెచ్చట నున్నది తెలిసికొన లేనంతటి స్థితికి వచ్చెను. ఆమెకు గదిలోనున్న ప్రతివస్తువును గిరగిర తిరుగుచున్నట్లు కన్పట్టెను.

చల్లనిచేయి ఆమె చేతినిదాకెను. ఒక సేవకుడు ఆమెను పట్టుకొని పోవుటకు వచ్చెను! ఆమె కళ్ల యందు దీనత యేర్పడెను. సింహము లేడి పిల్లపై బడినట్లుండెను!

ఆమె ఒక్క కేకతో మూర్ఛబొందెను. అక్బర్ నిర్దాక్షిణ్యముగ ఆమెనచ్చటనే వదలి జనానాకు వెడలిపోయెను. సలీమ్ కూడ తండ్రిని అనుసరించెను. ఎంత మార్పు!

❋ ❋ ❋

గాడాంధకార బంధురము! నిశ్శబ్దత - దూరమున నిశాసమయములందు సంచరించు పక్షుల కఠోర ధ్వనులు - భయము గొల్పు వాతావరణము! అట్టి సమయమందు జైలులో అనార్కలికి మెలకువ వచ్చెను.

ఆమె కళ్లను తెరిచి ఎచ్చటనుండెనో చూడసాగెను. ఆమెకా చీకటియందేమి కనబడును? తాను ఒక బందిఖానాలో ఉన్నట్లు గ్రహించుకొనెను. ఘోరము! చక్రవర్తి ఆజ్ఞ యేమి? తనను జీవముతో పాతివేయుమనియా? ఆమె నరనరములందలి రక్తము గడ్డ కట్టినట్లాయెను. మృతువ్యు! సూర్యోదయమే ఆమె ప్రాణముల నపహరించును! ఇక ఆమె జీవములతో నుండుట కొద్ది గంటలు మాత్రమే! ప్రేమ! ప్రేమవలన పొందిన సుఖమంతయు ఒక్కసారి మరపునకు వచ్చెను. కాలగమనమున! గడచుచున్న ప్రతినిముసము ఆమె జీవితములో కొంత కొంత భాగమును తినివేయుచున్నది. చక్రవర్తి ఆజ్ఞ! ఆమె ప్రాణములకు నోచుకొనలేదు!

అనార్కలి లేచి కూర్చున్నది. కాని, ఆమె తల తిరుగుచున్నది. ఆమె క్రిందపడి పొర్లుచు దుఃఖించ నారంభించెను. నరకకూపమునకు త్రోయబడిన జీవివలె - ఆమె పడిన బాధ - నరక బాధనుగూడ మించినది! నాటివరకును ప్రాణ సమానముగ జూచుకొనిన సలీమ్ ఎక్కడ! సలీమ్‌కొరకే ఆమె తన ప్రాణముల నివ్వదలచినది! సలీమ్‌ను దలచుకొని ఆమె కొంత మనశ్శాంతి బొందెను.

అనార్కలి దుఃఖముతో అలసట జెందెను. ఇంక ఆమె దుఃఖించలేక పోయెను. నెమ్మదిగా ఆలోచింపసాగెను. ఆమెకట్టి దుర్గతికి నడిపిన ఘట్టము లామె మనస్సున ఒకదాని తరువాత మఱియొకటి తిరుగసాగెను. ఆమె చేసిన తప్పేమి? యువరాజును ప్రేమించినది. ప్రేమ ఎవరి సొమ్ము? అట్లు ప్రేమించుట నేరమా? ఆమె తప్పు జేసినట్లామెకు తోచలేదు. ఆమె అమాయకపు ఆత్మ ఒక్కొకసారి ఆమె కాశను కల్పించును. మఱియొకసారి దుఃఖమునద్రోయును.

"ఓ భగవంతుడా! నువ్వీ స్వప్నము నేల కల్పించితివి? దీనియందు నిజమున్నదని నన్ను నమ్మించి మోసముజేసితివి! నాకు యువరాజు నందు ప్రేమను గల్పించి - ఆ ప్రేమను దృఢపరచి - తుదకు మరణమునకు త్రోవ జూపితివి. నన్నేల ఈ దుర్గతికి గురిచేసితివి?" అని ఆమె భగవత్ ప్రార్థన మొదలిడెను.

కాని ఆమెను ఓదార్చగలదేది? ఆమె మనోభావమున కలిగిన తుపానును ఆపగలదేది? ఆమె కొక విధమగు భయము కలిగెను. కాని ఏమి చేయగలదు?

ఆమె మనోభావములు సలీమ్ మీదికి పోయెను. ఆమె అట్టి దురవస్థలోనున్న సమయమున సలీమ్ ఆమెకు సహాయము చేయలేడా? ఆమెను మరణమునుండి తొలగించుటకు సలీమ్ సమర్థుడగునా? ఆమెను సలీమ్ నిజముగ ప్రేమించెనా? లేక శరీర సౌఖ్యముకొరకు ముఖప్రీతి మాటలుగ ఆమెను సంతృప్తి పరచెనా? ఈ తలపులు ఆమెను మరింత కలవర పెట్టెను. ఆమెకు మరణముకన్న - సలీమ్ ప్రేమ తాత్కాలికమా? అను ప్రశ్న ఎక్కువగ బాధించినది. ఒక ప్రక్క మరణదండన - వేఱొకప్రక్క తనను గాఢముగ ప్రేమించితినని చెప్పి మోసపుచ్చిన సలీమ్! ఆమె నిశ్చల అమాయకపు మనస్సునీరెండు విషయములును, బీభత్సము చేసెను!

దూరమున పాదముల చప్పు డామె వినగలిగెను, గది తలుపు తెరువబడెను. ఒక సేవకుడు దివిటీని పట్టుకొని లోనికి ప్రవేశించెను. ఆ సేవకుని మఱియొక వ్యక్తి అనుసరించియుండెను - ఆ వ్యక్తి సలీమే!

అనార్కలి సలీమ్‌నుచూచి పెద్దగా అరచెను. మరుసటిక్షణమే వారిద్దరును ఒక్క కౌగలిలో ఏకమైరి. సేవకుడు దివిటీతో గదిలో నుంచి నిష్క్రమించెను.

అనార్కలీ, సలీమ్‌లు నిశ్శబ్దముగ కొంతసేపు విలపించిరి. వారిద్దరి మనముల లోనూ చెప్పరాని బాధ! చాలసేపటికి వారు సంభాషణకు దిగిరి.

సలీమ్, "నీవు ధైర్యముతో నుండుము, నేను నిన్నిప్పటికిప్పుడు రక్షించగలను. నీవు నాతో రమ్ము" అనెను.

అనార్కలి ఆతృతతో సలీమ్‌ను చూడసాగెను. ఆమె కన్నులయందు ఆశ ప్రదర్శింపబడుచుండెను.

సలీమ్, "మనము పారిపోవుటకు నేను అన్నియు సిద్ధపరచితిని. నీవు నాతో రావలసినది. మనకొరకు గుఱ్ఱములు వేచియున్నవి. తెల్లవారకపూర్వమే మనము చాలాదూరము వెళ్లగలము. మనలను ఇతరు లెరుగకుండ మారు వేషములలో పారిపోవుదము. ఆలసించిన కార్యభంగమగును. త్వరపడుము" అనెను.

అనార్కలి, "మనము తప్పించుకొనుటకు అవకాశములేదు. మనను వారు వెంబడించి, తప్పక పట్టుకొందురు. నేను నా ఖర్మమును ఎదుర్కొందును. కాని మీరుకూడ లేనిపోని అవస్థలపాలగుట ఎందుకు. మీ క్షేమమునకు - మనము పారిపోవుట - భంగకరము" అని సన్నని గొంతుతో పలికెను.

సలీమ్ :- నేను రాబోవు పరిస్థితులన్నిటిని ఎదుర్కొనుటకే సిద్ధముగ నున్నాను. మఱియు, నేను ఏర్పరచినవి మిక్కిలి క్షేమకరమగు మార్గములు. క్షేమము నాశించి అనేక మంది స్నేహితులు మనకు సహాయము చేయుదురు. రాజభటులను నా స్నేహితులు తప్పు త్రోవ ద్రొక్కింతురు. మనము ప్రయాణము చేయు గుఱ్ఱముల

గిట్టలు కప్పబడియుండుటచే గిట్టల చప్పుడు కూడా వినబడదు. మనము వృధాచేయు ప్రతినిముసమును మిక్కిలి విలువగలది - త్వరగా వెళ్లుదము - రమ్ము.

అనార్కలి వెనుకకు తగ్గెను. ఆమె మూలమున సలీమ్ కూడ అవస్థల పాలగునేమో? ఆమె సలీమ్‌కు అగౌరవము కల్పించుటకు తనకు హక్కు లేదనియు, వారు తప్పించుకొనుటకు కాలాతీతమైన-అవకాశము లేదనియు ఆమె తలచెను.

అనార్కలి, "నాకు ఎట్లు వ్రాసివున్నదో అట్లే అగును. భగవంతుడు, చక్రవర్తి నేను మరణించుటకు ఆజ్ఞాపించిరి. నేనేల వారిని తిరస్కరింపవలెను? నేను మరణ దండనకు కొనిపోవబడునంత వరకును ఈ గదినుండి కదలన"నెను.

సలీమ్ ఆశ్చర్యపడెను.

"నీకేమైన పిచ్చి ఎత్తినదా? నా ప్రాణ సమానముగ చూచుకొను నిన్ను - ఒక నిరంకుశ ప్రభునిచే చంపబడుటకు నేను అవకాశ మివ్వను. నాకు నిన్ను రక్షించగల సామర్థ్యమున్నపుడు - దాని నేల ఉపయోగించు కొనరాద,"ని సలీమ్ సమాధానము చెప్పి, అనార్కలిని తనతో కొనిపోవుటకు ఆమె చేతిని లాగెను.

కాని, అనార్కలి తన చేతిని వెనుకకు లాగికొనుచు, "నా జీవితకాలము సమీపమైనది. నా ఖర్మమునుండి నేను తప్పించుకొనలేను. నేను తప్పించు కొనుటకు ప్రయత్నించిన అది మౌఢ్యమగును. ఏది ఎట్లున్నను - చక్రవర్తి మాట చట్టము వంటిది. నేను నీతో చక్రవర్తి ఆజ్ఞను తిరస్కరించి పారిపోయిన - మనను తప్పక పట్టుకొందురు. మనము పట్టుబడి నపుడు సంభవించు ప్రతిఘట్టమునూ నీవాలోచింప లేదా? అది నీకెంతయు అపాయ"మని వణుకుచున్న కంఠముతో ననెను.

సలీమ్ తొందరతో, "నీ ప్రశ్నలకు నేను సమాధాన మివ్వలేను.. మఱియు అట్లు సమాధానము చెప్పుట కిది సమయమును గాదు. నా తండ్రి నిరంకుశుడు. ఆయన నాకు ఎట్టి అవకాశమునూ ఇవ్వలేదు - కాన నేనాయనను తిరస్కరింప వలసి వచ్చినది. ఈ ఢిల్లీ సింహాసనమును మఱియొక చక్రవర్తి ఎక్కజాలడు. ఎప్పటికయిననూ ఈ సింహాసనము నాదే."

అనార్కలి సలీమ్ మాటలు వినెను - కాని ఆమె ఏమియు చెప్పలేదు. ఆమె మౌఢ్యము యువరాజునకు ఆశ్చర్యము కలిగించెను. ఆమె మరణము నుండి రక్షింపబడుట కెందుల కొప్పకొనదు? ఆమె ప్రాణము ఆమెకు తీపి గాకనా?

"అనార్కలీ! నీవిట్లు ఎందుకు భీష్మింతువు? నీవు కాని జీవితము నాకొక అంధకారము వంటిది. నీ మరణము నా మరణమునకు గూడ కారణమగును. నీవు నాతో రాకున్న - నేనీ గదిని వీడ"ననెను.

అనార్కలిలో ఒక మార్పు కలిగెను. ఆమెకు ఆశాజ్యోతి కాన్పించెను. అనార్కలి, 'ఇప్పటికీ ఆలస్యమవ లేదా? మనము తప్పించు కొనుటకింకను అవకాశమున్నదా?' అని సలీమ్‌ను ప్రశ్నించెను.

సలీమ్ వారికి అపాయము లేదనియు, వారు తప్పించుకొనుట కింకను అవకాశము గలదనియు తాను నమ్మకమగు స్నేహితుల సహాయమున తప్పించుకొన గలమనియు చెప్పి, అనార్కలిని సమాధాన పరచి ఆమెను తీసికొని పోవుటకు చేయిపట్టుకొనెను.

ఇంతలో తలుపు తెరువబడి, భయము గొల్పు ముఖముతో ఒక వ్యక్తి ఆ గదిని ప్రవేశించెను. ఆ వ్యక్తి సలీమ్‌కు నమస్కరించి, "చక్రవర్తిగారు వచ్చుచున్నా"రని చెప్పెను.

సలీమ్ భయపడి, "ఇప్పుడు ఏమి చేయుద"మని ప్రశ్నించెను.

"మనము ఆలసింపరాదు. మీరు ముందీగదిని విడిచివెళ్లి, చక్రవర్తిగారు వెళ్లిన పిదప తిరిగి రావచ్చు"నని ఆ వ్యక్తి చెప్పెను.

"రహీంఖాన్ నీవు గది బయిట వేచియుండుము - నే నిప్పుడే వచ్చుచున్నా"నని సలీమ్ ఆ వ్యక్తిని పంపివేసెను.

"అనార్కలీ నేను త్వరలోనే తిరిగి వత్తును. నీవు నేను వచ్చునప్పటికి సిద్ధముగ నుండుము" అని చెప్పెను.

అనార్కలి మాటలాడలేదు. ఆమె కన్నులలోని ఆశాజ్యోతి ఆరిపోయినది. దీనముగ ఆమె సలీమ్‌ను చూచెను. సలీమ్ ఆమెను కౌగలించుకొని - మరుక్షణమున గదిలోని దివిటీని ఆర్పి గదినుండి నిష్క్రమించెను.

అనార్కలి ఒక్కమాటకూడ మాట్లాడలేక పోయినది. ఆమె అట్లే నిలబడిపోయినది. యువరాజు గదిని వీడెను. తిరిగి అంధకారములో ఒంటరిగా. అనార్కలి బాధ పడసాగెను!

సలీమ్ వెళ్ళిన తరువాత అనార్కలి గది వద్ద కెవరను రాలేదు. రహీంఖాన్ అబద్ధమాడెను. చక్రవర్తిగాని, ఇతరు లెవ్వరునుగాని వచ్చియుండలేదు.

సలీమ్‌కు సహాయము జేయువా రనేకులుండిరి. అది కారణముగ సలీమ్‌కు స్వతంత్రతను సంపాదింప తండ్రిపై తిరుగుబాటులుగూడ గావించియుండెను. రహీంఖాన్ జైళ్ళపై నధికారి. అతడు యువరాజునకు నమ్మకమైన సేవకులలో నొకడు. చక్రవర్తి ముసలి వాడగుచున్నాడు. యువరాజు ప్రాపకము సంపాదించిన మంచిదని రహీం దలచియుండెను. ఆ రాత్రి సలీమ్ - రహీంఖానుని సహాయముననే అనార్కలిని చూడగలిగెను. సలీమ్ అనార్కలిని చివరిచూపుగ చూచునని మాత్రమతడు తలచి యుండెను. సలీమ్ అనార్కలితో పారిపోవుటకు ప్రయత్నించుచున్నట్లు రహీంకు తెలియదు.

సలీమ్ అనార్కలిని చూచుటకు కెళ్ళి నప్పుడు – రహీం, వారి మాటలు వినవలెననుకొనెను. కాని మాటల వలన రహీం, సలీమ్ అభిప్రాయమును గ్రహించగలిగెను. రహీం ఏమి చేయవలెను? సలీమ్‌ను అడ్డగించిన మరణము తప్పదు. సలీమ్‌ను అడ్డగింపకున్న చక్రవర్తి మరణదండనకు గురి యగును! ఏదో విధముగ సలీమ్ ప్రయత్నముల విఫలము గావించుటకు పూనుకొనెను.

సలీమ్‌కు అనార్కలి గదిని వీడగనే రహీం అతనికి దూరమున రెండు దివిటీలను చూపెను; ఆ దివిటీలను రహీంఖానునిచే నియోగింపబడిన ఇద్దరు సేవకులు పట్టుకొని యుండిరి. కాని వారు చక్రవర్తి మనుష్యులు కారు. సలీమ్ ఆ దివిటీలను రెండవసారి చూడలేకపోయెను – తండ్రి భయముచే అతడు ఆ స్థలము నుండి విరమింప దలచెను.

రహీం యువరాజును రహస్య ద్వారముల ద్వారా నడిపించి – సలీమ్ గదికి తీసుకొనిపోయెను.

సలీమ్, "ఆ వచ్చునది చక్రవర్తియేనని నీకు నమ్మకమున్నదా?" అని రహీంను ప్రశ్నించెను.

రహీం, "అవును – ఆయన చక్రవర్తియే!" నని రహీం సమాధానము చెప్పెను.

సలీమ్ : – చక్రవర్తి ఇప్పుడెందులకు వచ్చెను?

రహీం : చక్రవర్తి అప్పుడప్పుడు మాకు చెప్పకుండ, తనిఖీ చేయుటకు వచ్చుచుందురు. ఈ రాత్రికూడ అట్లే వచ్చియుండ వచ్చును.

సలీమ్ :– నేటివరకును చక్రవర్తి అనేకులకు ఆశ్చర్యము గలిగించెను; రేపు ఉదయము అతడే ఆశ్చర్యపడును

సలీమ్ చిరునవ్వు నవ్వెను. ఆ నవ్వులో ఏదియో గూడార్థమున్నట్లుండెను.

కొన్ని నిమిషములు గడచెను. రహీంకు యువరాజు చేయబోవు పనివలన తనకు గలుగు అపాయమును దలచి నప్పుడు – మనసులో బాధ పడసాగెను. ఇక కొద్ది కాలములో యువరాజు అనార్కలిని దోడ్కొని పోవును.

అతనికి ఏమి చేయుటకును దోచదయ్యెను. సలీమ్‌ను అడ్డగింపకున్న తెల్లవారగనే రహీం తల కోటగుమ్మము వద్దనుండును. యువరాజు నడ్డగించిన – మరుక్షణమే అతని తల భూమిపై బడును. రహీం తనలో తాను కర్తవ్యమును ఆలోచించుకొనెను.

రహీం – తమరు త్రాగుదురా?

అప్పటివరకును జరిగిన గాథ తనలో తను తలపోసి కొనుచున్న సలీమ్ – అప్రయత్నముగ, "తీసికొని రమ్మ"నెను.

రహీం ప్రక్కగదిలోనుండి సారాను దెచ్చుటకు వెళ్ళెను. ఒక పాత్రలో సారాయిని దీసికొని - దానిలో మత్తుమందు కలిపి యువరాజు వద్దకువచ్చెను. ఆ మందు తెల్లని దగుటచే సారాయి రంగునకు మార్పు కలుగలేదు.

రహీం తెచ్చిన సారాను సలీమ్ త్రాగెను. సలీమ్ ఉత్సాహముగ నుండెను.

సలీమ్ :- నీవు పోయి చక్రవర్తి ఆ స్థలమునుండి మరలెనేమో చూచి రమ్ము.

రహీం :- చిత్తము.

రహీం యువరాజును వీడివెళ్లి తిరిగి రాలేదు. ఆ మత్తుమందు తన పనిని నిర్వర్తించునని అతనికి కూడా తెలియును. అట్లే యువరాజు తెల్లవారిన దనుక స్మృతికి రాలేదు.

❋ ❋ ❋

అనార్కలి యువరాజు రాకకై నిరీక్షించుచుండెను. ఆమెకు అనుమాన మధికమయ్యెను. కాని ఇంకను సలీమ్ వచ్చునని ఆమె ఆశతో నుండెను.

మెల్లమెల్లగా చంద్రుడస్తమించ మొదలిడెను. తెల్లవారు జామున కొద్దికొద్ది వెలుగులు లోకమున ప్రవేశించి - మెల్లగ అనార్కలి బంధింపబడిన గదిలోనికి కూడ చొరబడెను. ఆమె కళ్ల ముందేదియో తళుక్కున మెరసెను. అది ఆమె వ్రేలినున్న రత్నపుటుంగరము. దానిని ఆమె తల్లి చనిపోవునపుడు, "దీనిని ఎప్పుడునూ ఉపయోగించవద్దు. ఇక దారి కాదని నీకు తోచినప్పుడు మాత్రము దీని నుపయోగింపు"మని చెప్పి అనార్కలి వ్రేలినా ఉంగరముతో అలంకరింప జేసెను.

అనార్కలికి ఆమె తల్లి చెప్పిన చివరిమాట అంతరార్థము తెలిసినది. ఆ ఉంగరమును మ్రింగెను. తన చిన్నతనము మొదలు నాటివరకును జరిగిన సంగతు లొక్కొక్కటే ఆమెకు జ్ఞాపకమునకు వచ్చెను. సలీమ్‌ను తలచుకొనుచు - చిరునవ్వు నవ్వి ఆమె ప్రాణములు వీడెను. కాని ఆ చిరునవ్వు తొణుకులాడు ఆమె పెదవులు మాత్రమట్లే యుండెను. చంద్రుడామె ఎడబాటునకు విరమించెను.

తెల్లవారినది. సూర్యుడుదయించెను. రాజభటులు అనార్కలిని గొనిపోవుటకు వచ్చిరి. కాని అనార్కలి ఈ పాపిష్టి లోకము నప్పుడే వీడినది!

❋ ❋ ❋

అక్బర్ పరలోకమును జేరెను. సలీమ్ ఢిల్లీ సింహాసనమునెక్కి జహంగీ రయ్యెను.

అనార్కలి సంగతిని జహంగీర్ మరచిపోయెను. ఆమె యందాతనికి గల ప్రేమ - నేడు పరస్త్రీల యెడ తిరిగెను. జహంగీర్ మెహర్నిసాను ప్రేమించెను. అప్పటికి

అనార్కలి అతని ఊహా ప్రపంచమునుండి పూర్తిగ తొలగిపోయెను. నేటి జహంగీర్ ప్రేమ కాంతులలో మెహర్నిసా (ఈమెయే నూర్జహాన్)కు మాత్రమే స్థానమున్నది.

అది సాయింత్రము. జహంగీరు మెహర్నిసాయందు తన కేర్పడిన ప్రేమను, నాటి వరకును ఆమె యెడ తాను జరిపిన విఫల యత్నముల తలచుచు - రాచోద్యానమున నడుచుచుండెను. అతనికి కొద్దిదూరములో, ఎర్రని పుష్పములతో విరాజిల్లు దానిమ్మ చెట్టు క్రింద - పాలరాతితో కట్టబడిన ఒక సమాధి కనిపించెను. జహంగీరు నాటి వరకును ఆ సమాధిని చూడలేదు. ఆ సమాధిలో ఇమిడియున్న వారెవరో అతనికి తెలియదు.

జహంగీరుకు కొద్ది దూరములో పని చేయుచున్న ఒక ముసలి తోట మాలియుండెను. ఆ తోటమాలిని పిలచి, "ఈ సమాధి ఎవరి"దని జహంగీరు ప్రశ్నించెను.

ఆ తోటమాలి మొదట సమాధిని, తరువాత జహంగీరును చూచెను. కాని, అతను సమాధాన మిచ్చుటకు భయపడెను.

జహంగీర్ తిరిగి, "ఈ సమాధిలో ఎవ్వరున్నా"రని అడిగెను.

తోటమాలి, "అనార్కలీ బీగమ్-" అని సమాధానము చెప్పెను.

అనార్కలీ! పూర్వగాథలు జహంగీరుకు జ్ఞాపకమునకు వచ్చెను. అనార్కలి ఆ సమాధిపై నాట్యము చేయు చున్నట్లాతనికి కన్పించెను. మెహర్నిసాను అతడు క్షణకాలము మరచెను. అనార్కలి జీవిత గాథ జహంగీరు ఊహా ప్రపంచమున నాట్యమాడ దొడగెను. ఆమె నవ్విన చిరునవ్వు లన్నియు-ఆతనికి జ్ఞాపకమునకు వచ్చెను. రహీంఖానుని ద్రోహము అతనికి జ్ఞాపకము వచ్చెను! కాని అప్పటికే రహీం ఖానుడు చనిపోయి యుండెను.

జహంగీరు అనార్కలిని దలచుకొని రెండు అశ్రుకణముల నామె సమాధిపై రాల్చెను. నాటికి తోటను వీడెను.

మరుసటి ఉదయము అనార్కలి సమాధిపై చక్కని కట్టడమును కట్టించి తన స్వహస్తములతో ఆ సమాధిని పూజించెను!

– వాహిని, *22.1.1939; 23.1.1939*